సాక్షి నంద్యాల

సోమవారం ; 31 ; జూలై ; 2023



భ్రామరీకి ఊయలసేవ
శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవి అమ్మవారికి మూలనక్షత్రం సందర్భంగా ఆదివారం ఊయల సేవ నిర్వహించారు. ఊయలలో ఉత్సవ మూర్తులను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



శనగల బసవన్నకు పూజలు
శ్రీశైలంటెంపుల్: ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి త్రయోదశి సందర్భంగా పరోక్షసేవను శాస్త్రోక్తంగా ఈఓ లవన్న, అర్చకులు నిర్వహించారు.



మాళ మల్లేశ్వరుడికి బండార్చన
హొళగుంద: దేవరగట్టులో వెలసిన మాళ మల్లేశ్వరస్వామికి ఆదివారం బండరార్చన, కుంకుమార్చనతో పాటు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

న్యూస్‌రీల్

శ్రీశైలంలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శని, ఆదివారాలు సెలవులు కావడంతో క్షేత్రానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలం చేరుకున్నారు. పాతాళగంగ పుణ్యస్నానాలనంతరం భక్తులు మల్లన్న దర్శనార్థమై ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలకు చేరుకున్నారు. దీంతో అన్ని క్యూ కంపార్ట్‌మెంట్లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయాధికారులు క్యూలలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు.

నేడు స్పందన
నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం వినూత్న తరహాలో 'జగనన్నకు చెబుదాం–స్పందన' కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరై ప్రజల నుంచి అర్జీలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

మహానందీశ్వరుడికి 35 కిలోల వెండి బహూకరణ



ఆలయ ఈఓ, చైర్మన్‌కు వెండి బిస్కెట్లను అందజేస్తున్న దాత, కుటుంబీకులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ మహానందీశ్వరస్వామికి వెండి రుద్రాక్ష మండపం నిర్మాణం కోసం నంద్యాలకు చెందిన ఎస్‌బీఐ రిటైర్డ్ ఉద్యోగి మారెం వెంకటసుబ్బయ్య, శమంతకమణి దంపతులు 35 కిలోల వెండి అందించారు. ఈ మేరకు ఆదివారం ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డికి అందజేశారు. అనంతరం దాతలు, వారి కుటుంబ సభ్యులను ఆలయ అధికారులు సన్మానించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్ల ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేయించారు.

భక్తిశ్రద్ధలతో ఆశుర
సి.బెళగల్: మొహర్రం ముగింపు సందర్భంగా ఆదివారం సి.బెళగల్‌లో భక్తులు ఆశుర (కిరాత్)ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లిం గ్రంథాల ప్రకారం యుద్ధ భూమిలో హసన్, హుసేన్లు వీరమరణం పొంది ఉంటారని, వీరి ఆచూకీ కోసం అనుచరులు గాలిస్తారాని మత పెద్దలు తెలిపారు. ఇందుకు గుర్తుగా ఆదివారం గ్రామంలోని వీధులలో భక్తులు విషాద గీతాలు ఆలపిస్తూ తిరిగారు. మొహర్రం వేడుకలు ముగియడంతో భక్తులు పీర్ల చావిడీల దగ్గర ప్రత్యేక ముగింపు ప్రార్థనలు జరిపారు.



ఆశుర నిర్వహిస్తున్న భక్తులు

నది ప్రవాహాల వెంబడి నాగరికత విస్తరించిందనేది వాస్తవం. నీరు అందుబాటులో లేకపోతే తాగు, సాగునీటికి సమస్యే. నీటి లభ్యత ప్రాంతాల్ని బట్టి మారుతూ ఉంటుంది. కొన్నిచోట్ల అందుబాటులోని నదులు, జలాశయాల వల్ల సమృద్ధిగా లభిస్తే, మరికొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరే గతి. వాన నీరు వృథా కాకుండా ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జల సంరక్షణ చర్యలు చేపట్టడంతో మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయి.

ఇటీవల కురిసిన వర్షానికి నీటితో కళకళలాడుతున్న డోన్ మండలంలోని ఉంగరాణిగుండ్ల చెక్ డ్యామ్



పుడమి తల్లికి జలహారం

- సత్ఫలితాలనిస్తున్న వాటర్‌షెడ్ కార్యక్రమాలు
- రూ.21.47 కోట్లతో పనులు
- చెక్‌డ్యాంలు, పర్క్యులేషన్ ట్యాంకు నిర్మాణాలతో పెరిగిన భూగర్భజలం
- 9,763 హెక్టార్లలో వర్షపు నీటి సంరక్షణకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం చర్యలు
- నిల్వ నీటి వినియోగానికి డీజిల్ ఇంజిన్ల పంపిణీ

నంద్యాల(సెంట్రల్): వాన నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు చేపట్టిన వాటర్‌షెడ్ పనులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. జిల్లాలో డోన్ మండలం ఎద్దులపెంట, సంజామల మండలం ఆకుమళ్లలో రూ.21.47 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం మోడల్ వాటర్ షెడ్ ప్రాజెక్టులు చేపట్టింది. ఆకుమళ్ల ప్రాజెక్టు పరిధిలో సంజామల మండలం ఆకుమళ్ల, వసంతాపురం, హొత్రమాన్‌దిన్నె, బొందెలదిన్నె, కమలపురి, మెట్లకొత్తూరు, ముదిగేడు గ్రామాల్ని మైక్రో వాటర్‌షెడ్లుగా గుర్తించారు. ఎద్దుపెంట ప్రాజెక్టుకు సంబంధించి డోన్ మండలం ఎద్దుపెంట, వేపదిన్నె, ఉంగరాణిగుండ్ల, దొరపల్లిని గుర్తించి పనులు చేపట్టారు. ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో మూడు రకాల పనుల్ని చేస్తున్నారు. వీటిలో ప్రావేశిక పనులు (ఈపీఏ), ఉత్పాదక పెంపుదల (పీఎస్ఐ), సహజవనరుల యాజమాన్యం (ఎన్ఆర్ఎం) చేపడుతున్నారు. సంజామల మండలం ఆకుమల్ల ప్రాజెక్టులో రూ.11 కోట్లతో 5,000 హెక్టార్లు, ఎద్దుపెంట ప్రాజెక్టులో భాగంగా రూ.10.47 కోట్లతో 4,763 హెక్టార్లలో వాన నీటి సంరక్షణ కోసం చెక్‌డ్యాంలు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, కందకాల తవ్వకం, పొలాల్లో మృత్తికా సంరక్షణకు రాతి కట్టడం తదితర పనులు జరుగుతున్నాయి. ఇందు కోసం హెక్టారుకు రూ.22 వేల నిధులు కేటాయించారు. పనుల్లో భాగస్వామ్యం, పర్యవేక్షణ కోసం గ్రామ కమిటీల్ని నియమించారు.

ఉత్పాదక పెంపుదలకూ ప్రాధాన్యం
పంట కుంటలు తవ్వటంతో సరిపెట్టకుండా వాటి నుంచి నీటిని తోడి వినియోగించుకోవటానికి ఒక్కొక్కటి రూ.48 వేల విలువైన ఆయిల్ ఇంజిన్లను సైతం రాయితీతో పంపిణీ చేశారు. ఇలా ఆకుమళ్ల ప్రాజెక్టు పరిధిలో 150, ఎద్దుపెంట పరిధిలో 54 మందికి ఆయిల్ ఇంజిన్లు ఇచ్చారు. వీటివల్ల కరెంట్‌తో సంబంధం లేకుండా రైతులు ఎప్పుడైనా నీటిని కట్టుకోవటానికి అవకాశం కలిగింది. అంతేకాక ట్రాక్టరుతో వాడే విత్తనం గొర్రు, నాగళ్లు, స్ప్రేయర్లు తదితర పరికరాల్ని ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, మిగతా వర్గాలకు 80 శాతం రాయితీతో అందజేస్తుండటం గమనార్హం. మరోవైపు ప్రావేశిక పనుల్లో భాగంగా మోడల్ వాటర్‌షెడ్ల పరిధిలోని గ్రామాల్లో ఒక్కొక్కటి రూ.28 వేల విలువ చేసే సోలార్ లైట్లను ఏర్పాటు చేసి సౌరకాంతులు పంచుతున్నారు. మొత్తం నిధుల్లో 47 శాతం సహజవనరుల నిర్వహణకు, 15 శాతం ఉత్పాదక పెంపునకు, 2 శాతం ప్రావేశిక పనులకు కేటాయించారు. మిగతా నిధులను సాధారణ పనులకు ఖర్చు చేస్తున్నారు.

భూగర్భ జలాలు పైపైకి
ఎద్దుపెంట ప్రాజెక్టు పరిధిలోని ఉంగరాణిగుండ్లలో మొత్తం 4 కుంటల నిర్మాణాలు ప్రారంభించగా 3 పూర్తయి మరొకటి నిర్మాణంలో ఉంది. ఇందులో 5 ఎకరాల్లో పూర్తిచేసిన పర్క్యులేషన్ ట్యాంకు (ఊట కుంట) రూ.8.78 లక్షలతో 12 వేల క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో నిర్మించారు. ఇటీవల కురిసిన తేలికపాటి వర్షాలకే ఇది జలకళను సంతరించుకుంది. ఫలితంగా దీని పరిధిలో 22 మంది రైతులకు సంబంధించిన 55 ఎకరాలకు నీరందటంతో పాటు భూగర్భ జలాలు పునరుజ్జీవాన్ని సంతరించుకున్నాయి. మిగిలిన వాటిలో రెండు పర్క్యులేషన్ ట్యాంకుల్లో మూడున్నర ఎకరాల్లో 8 వేల క్యూబిక్ మీటర్లతో ఒకటి 13 వేల క్యూబిక్ మీటర్లతో మరొకటి నిర్మించారు. ఇక పొలాల్లో ఫారంపాండ్స్, రాతి కతువల పనులు సైతం జోరుగా సాగుతున్నాయి. రాతి కట్టడం పనుల్లో భాగంగా దొరవారి పల్లెలో 25 మందికి, ఆకుమళ్ల– 45, కమలపురిలో నలుగురు రైతుల పొలాల్లో మట్టి కోతకు గురి కాకుండా కతువలు నిర్మించారు. ఆకుమళ్లలో 28, ముదిగేడు 5, వసంతాపురం 4, నట్లకొత్తూరు 18, ఎద్దుపెంట 26, వేపదిన్నె 18, ఉంగరాణిగుండ్ల 12 ఫారమ్‌పాండ్స్ తవ్వారు. వీటితో పాటు కొండలు, వాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కందకాలు తవ్వి నీటిని నిల్వ చేసి ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకేలా పనులు జరుగుతున్నాయి. ఆకుమళ్లలో మొదలు పెట్టిన వాటర్ అబ్జర్వేషన్ ట్యాంకు నిర్మాణం పూర్తయింది. ఎద్దుపెంటలో సైతం నిర్మాణంలో ఉంది.



నట్లకొత్తూరులో పొలంలో తవ్విన పంటకుంటలో నిలిచిన నీరు

వర్షపు నీటి నిల్వకు అత్యంత ప్రాధాన్యం



జిల్లా వ్యాప్తంగా వర్షపు నీటి సంరక్షణలో భాగంగా డ్వామా తరఫున పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. మోడల్ వాటర్‌షెడ్ కింద ఎంపికైన గ్రామాల పరిధిలో విస్తృతంగా పనులు చేపట్టాం. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు, కార్యాలయ ప్రాంగణాలతో పాటు, ఖాళీ స్థలాల్లో ఇంకుడు గుంతల తవ్వకానికి ముందుకు రావాలి. ఇటీవలే ఆరు మండలాల్లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు సైతం చేపట్టడానికి గుర్తింపు ప్రక్రియ పూర్తి చేశాం. ప్రతి వర్షపు చుక్క విలువైనది.

– రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ

రాయితీపై ఆయిల్ ఇంజిన్ ఇచ్చారు



వర్షాకాలం పెద్ద వానలు పడినప్పుడల్లా నా పొలంలోని సారవంతమైన మట్టి కొట్టుకు పోయేది. దీంతో రాళ్లు తేలే దశకు చేరుకుంటున్న తరుణంలో వాటర్‌షెడ్ కింద నా చేనులో రాతి కతువ పనులు మంజూరు చేశారు. కతువ ధ్రుడంగా నిర్మించటంతో ఇక ఏ సమస్యా లేదు. అంతేకాక పంట కుంట సైతం తవ్వి ఆయిల్ ఇంజిన్ రాయితీపై ఇచ్చారు. దీంతో ఎప్పుడూ వర్షాధార పంటలు వేసుకునే నాకు ఇతర పంటలు వేసుకోవటానికి అవకాశం లభించింది. ప్రభుత్వానికి, వాటర్‌షెడ్ అధికారులకు రుణపడి ఉంటాం. – పేరం మధుసూదన్‌రెడ్డి, ఆకుమళ్ల, సంజామల మండలం

బోర్లలో నీటి మట్టం పెరిగింది



మా గ్రామంలో సాగు మొత్తం బావులు, బోర్లపైనే ఆధారపడి ఉంది. వర్షాలు సమృద్ధిగా కురిసినప్పుడు మాత్రమే నాలుగైదు నెలలు నీళ్లు బాగా పారేవి. కానీ వాటర్‌షెడ్ కింద నిర్మించే పెద్ద కుంటలతో మా గ్రామ సాగు స్వరూపమే మారనుంది. ఇటీవల చెదురు మొదురు వర్షానికే కుంట నిండి జలకళను సంతరించుకుంది. దీంతో ఇప్పటికే సుమారు 40 బావులు, 100కు పైనే బోర్లలో నీటిమట్టం పెరిగింది. దీంతో పాటు అందరం కలిసి కందకాల తవ్వకం, రాతి కతువల పనులు, సోలార్‌లైట్ల ఏర్పాటు పూర్తి చేశాం. మా గ్రామ ప్రజలంతా సీఎం సాయాన్ని మర్చిపోలేరు.

– ఎం. చిన్నమద్దయ్య, సర్పంచ్, ఉంగరాణిగుండ్ల

మిస్సింగ్ కేసులను ఛేదించండి



ఎస్పీ రఘువీర్‌రెడ్డి

మహానంది: మిస్సింగ్ కేసులను సాంకేతిక పరిజ్ఞానంతో త్వరితగతిన ఛేదించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశించారు. బండి ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని, తరచూ వాహనాల తనిఖీ చేపడుతుండాలన్నారు. ఇటీవల అధికంగా జరిగే సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐ మల్లికార్జున, సిబ్బందితో వివిధ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రాయితీపై పశువుల దాణా
నంద్యాల(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై పశువుల దాణా సరఫరా చేస్తోందని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. జిల్లాకు 500 మెట్రిక్ టన్నుల సంపూర్ణ దాణా కేటాయించారని, ఇప్పటి వరకు 60 మెట్రిక్ టన్నుల కోసం పాడిరైతులు నమోదు చేసుకున్నారని వెల్లడించారు. కిలో దాణా రూ.15.80 కాగా, రాయితీ రూ.9.30 పోనూ రైతులు రూ.6.50 చెల్లించి దాణాను పొందవచ్చని సూచించారు. 25 కేజీల పరిమాణంలో పంపిణీ చేస్తున్నామన్నారు. పలు రకాల పోషకాలతో మిళితమైన ఈ దాణాతో పాల దిగుబడులు పెరగటంతో పాటు పశువులకు బలవర్ధకమైన ఆహారంగా ఉపయోగపడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ పశువైద్యశాలలు, వెటర్నరీ డిస్పెన్సరీలతో పాటు దగ్గర్లోని ఆర్‌బీకే కేంద్రాల్లో సంప్రదించి పాడి రైతులు పొందవచ్చని పేర్కొన్నారు.

మఠం ముందు భాగంలో భక్తుల రద్దీ



శ్రీ మఠంలో వైభవంగా ద్వాదశి వేడుకలు
మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం ద్వాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూల బృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. బెంగళూరు నుంచి తీసుకుని వచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. రాత్రి ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఉంచి శ్రీ మఠం మాడ వీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్య స్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



వరద నీటితో సుంకేసుల జలాశయం



ముచ్చుమర్రి పంప్‌హౌస్ వద్ద జలకళ




పోతిరెడ్డిపాడు గేట్లను తాకిన కృష్ణాజలాలు

ప్రాజెక్టులు.. పరవళ్లు

- టీబీ డ్యాంలో 75 టీఎంసీల నీరు నిల్వ
- సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- పోతిరెడ్డిపాడును తాకిన కృష్ణాజలాలు

హొళగుంద/గూడూరు/జూపాడుబంగ్లా/పగిడ్యాల: ఇటీవల కురిసిన వర్షాలతో జలాశయాలకు నీటి చేరిక ఆశాజనకంగా కొనసాగుతోంది. దీంతో అన్నదాతలు ఖరీఫ్‌లో పంటల సాగును ముమ్మరంగా చేపడుతున్నారు. తుంగభద్ర జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ఆదివారం సాయంత్రానికి 75 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నుంచి 1,965 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర ఎగువ, దిగువ, ఆర్‌బీసీ కాలువలకు వదులుతున్నారు. డ్యాం ఎగువ భాగంలోని ఆగుంబే, శృంగేరి, తీర్థనహళ్లి, కొడుగు, వరనాడు, శివమొగ్గ, మలెనాడు తదితర ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లోలో మందగమనం కనిపిస్తోంది. ఈ నెల 26, 27 తేదీల్లో 1.10 లక్షల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో రాగా ఆదివారం సాయంత్రానికి అది 48,058 క్యూసెక్కులకు పడిపోయింది. ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సుంకేసుల జలాశయానికి 1,310 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఒక గేట్‌ను అర మీటర్ మేర ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు.

ఆయకట్టు రైతుల్లో ఉత్సాహం
కృష్ణా జలాలు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లను తాకడంతో ఆయకట్టు రైతుల్లో ఉత్సాహం పెరిగింది. ఆదివారం సాయంత్రం సమయానికి శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 42,562 క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరుతోంది. డ్యాం నీటిమట్టం 846.70 అడుగులకు చేరుకుంది. ఈ సమయంలో గేట్లను ఎత్తి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకొనే అవకాశం ఉంది. శ్రీశైలం డ్యాంలో మరో 8 అడుగుల నీటిమట్టం చేరితే అధికారికంగా నీటిని విడుదల చేసుకొనే అవకాశం ఉంది. ఏటా డ్యాంలో 854 అడుగుల మేర నీటిమట్టం చేరుకొన్న తర్వాతనే ఎస్సార్బీసీ, జీఎన్ఎస్ఎస్, కేసీ ఎస్కేప్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా పోతిరెడ్డిపాడు వద్దకు కృష్ణా జలాలు చేరుకోవటంతో విస్తరణ పనులను కాంట్రాక్టర్లు ఆపివేశారు. పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌లోకి కృష్ణా వరద జలాలు వడివడిగా చేరుకుంటున్నాయి. ఆదివారం పంప్‌హౌస్‌లోకి 846 అడుగుల లెవెల్‌కు నీరు చేరినట్లు పర్యవేక్షక ఏఈఈ శశికుమారి తెలిపారు. ఈ ఎత్తిపోతల పథకం నుంచి కర్నూలు–కడప కెనాల్‌కు 4 మోటర్ల ద్వారా 5 టీఎంసీలు డ్రా చేయాల్సి ఉంది.



కృష్ణమ్మ ఒడిలోకి సంగమేశ్వరుడు
సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరుడు కృష్ణమ్మ ఒడిలోకి మెల్లగా చేరుకుంటున్నాడు. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో సంగమేశ్వరు ఆలయ ఆలయ ముఖ మండపంలోకి నీళ్లు ప్రవేశించాయి. శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 846 అడుగుల చేరుకుంటే ప్రాచీన ఆలయం పూర్తిగా నీట మునిగిపోతుంది. ఏటా సుమారు 8 నెలలపాటు స్వామి వారు జలాధివాసం చేయడంతో భక్తుల దర్శనానికి దూరం కానున్నారు. – కొత్తపల్లి

స్మార్ట్ బోధన

- విద్యా విధానంలో నూతన ఒరవడి
- అందుబాటులోకి డిజిటల్ విద్య
- జిల్లాలో 1,218 పాఠశాలలు ఎంపిక
- ఇప్పటికే 6,775 మంది ఉపాధ్యాయులకు శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేసి విప్లవాత్మక మార్పులు చేపట్టడంతో సర్కారు బడులు సరికొత్త రూపుదాల్చుతున్నాయి. ఈ క్రమంలో స్మార్ట్ బోధనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు తరగతి గదిలో ఏ పాఠ్యాంశం బోధించాలన్నా ఉపాధ్యాయులు బ్లాక్ బోర్డు, గ్రీన్ బోర్డులపై చాక్పీస్‌తో రాసి వివరించేవారు. ఇక నుంచి వీటి స్థానంలో డిజిటల్ బోర్డులు వచ్చేశాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాల్లో భాగంగా ప్రభుత్వం డిజిటల్ విద్యను ప్రవేశపెట్టింది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. డిజిటల్ విద్యకు కావాల్సిన డిజిటల్ బోర్డులను ఇప్పటికే కొన్ని పాఠశాలలకు సరఫరా చేసింది. వీటిని ఉపయోగించే విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చింది. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో స్మార్ట్ బోర్డుల ద్వారా పాఠ్యాంశాలు బోధన ప్రారంభమైంది. జిల్లాలో 1,409 పాఠశాలలు ఉండగా అందులో 1,218 పాఠశాలలకు డిజిటల్ బోధనకు ఎంపిక కాగా మొదటి, రెండు విడతల్లో 431 డిజిటల్ బోర్డులు పాఠశాలలకు చేరుకున్నాయి. జిల్లాలో 1,54,561 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ప్యానల్ ప్రోగ్రాం) కింద జిల్లాలో పాఠశాలలకు 892 స్మార్ట్ టీవీలు అందజేశారు. డిజిటల్ టచ్ స్క్రీన్ టీవీ ఆఫ్ చేసిన తర్వాత వైట్ మార్కర్ బోర్డులా ఉపయోగించుకోవచ్చు. ఇప్పటికే డిజిటల్ బోర్డుల ద్వారా విద్యను అభ్యసించేందుకు 6,775 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. ప్రస్తుతం ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్మార్ట్ బోధనకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా జిల్లాలో డోన్, బేతంచెర్ల, పాములపాడు, మిడుతూరు, చాగలమర్రి మండలాల ఉపాధ్యాయులకు నంద్యాలలోని ఎస్‌వీఆర్, ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలల్లో ఒక్కో బ్యాచ్‌కు రెండు వారాల పాటు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్నెట్ అనుసంధానంతో ఉన్న ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ప్యానల్ బోర్డును ఏ విధంగా ఉపయోగించాలి, సైన్స్, సోషల్ సబ్జెక్ట్‌ల్లో బొమ్మల ద్వారా ఎలా బోధించాలనే అంశాలపై అవగాహన కల్పించారు.



పాఠశాలలో డిజిటల్ బోర్డుపై పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

విద్యార్థులకు ఎంతో ఉపయోగం



డిజిటల్ టచ్ స్క్రీన్‌పై విద్యా బోధన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. సబ్జెక్ట్‌పై పూర్తిగా అవగాహన కల్పించేందుకు ఇంటర్నెట్ సాయంతో వివరించే సౌకర్యం కల్పించడం బాగుంది. ఈ విధానంలో ముఖ్యంగా గణితం, సైన్స్, సోషల్ పాఠాలు సులభంగా అర్థం చేసుకోగలరు. ఇలా బోధించడంతో విద్యార్థులు పాఠ్యాంశాలను ఎక్కువ కాలం గుర్తుంచుకుంటారు. – సుబ్బన్న ఉపాధ్యాయుడు, గడివేముల

సులభంగా వివరించవచ్చు



ఐఎఫ్‌పీ విధానంలో విద్యార్థులకు కష్టతరమైన పాఠ్యాంశాలైనా సులభంగా వివరించవచ్చు. విద్యార్థులకు అవసరమైనప్పుడు మళ్లీ బొమ్మల ద్వారా అవగాహన కల్పించేందుకు అవకాశం ఉంది. డిజిటల్ టచ్ టీవీలను వైట్ బోర్డుగా కూడా ఉపయోగించుకోవచ్చు. ఇప్పటికే శిక్షణ పొందిన ఉపాధ్యాయులు వీటి ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.

– శ్రీకాంతరెడ్డి, మాస్టర్ ట్రైనర్, నంద్యాల

దృశ్య రూపం.. మరింత పరిజ్ఞానం
విద్యార్థులు సైన్స్ సబ్జెక్టుల్లో థియరీతో పాటు డయాగ్రమ్స్‌పై పట్టు సాధిస్తేనే అధిక మార్కుల సాధనకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా జీవ, రసాయన, భౌతిక శాస్త్రాల్లో చిత్ర పటాల ద్వారా వివరించాల్సి ఉంటుంది. అయితే కొందరు ఉపాధ్యాయులు బొమ్మలు బోర్డుపై గీసి, మరి కొందరు పాఠ్యపుస్తకాల్లో ఉన్న చిత్ర పటాల ఆధారంగా ఆయా పాఠ్యాంశాలను బోధిస్తుంటారు. ఇలాంటి బోధనతో విద్యార్థులకు కొంత అర్థమవుతున్నా పూర్తిగా అవగాహన చేసుకోలేక పోతున్నారు. స్మార్ట్ బోర్డులు అందుబాటులోకి రావడంతో పాఠం దృశ్య రూపంలో ఉండటంతో విషయ పరిజ్ఞానం పూర్తిగా అర్థవంతమయ్యే అవకాశం ఉంది. అలాగే యూట్యూబ్, ఫోన్, ట్యాబ్‌లలో ఉన్న సమాచారం సైతం స్క్రీన్‌పై చూసే అవకాశం కూడా కల్పించడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారింది.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

కృష్ణగిరి: మండల కేంద్రమైన కృష్ణగిరి నుంచి ఎరుకలచెర్వుకు వెళ్లే రహదారి పక్కనే ఆదివారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి అచేతనంగా పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. వెంటనే కృష్ణగిరి పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని మెరుగైన వైద్యం కోసం 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మృతునికి సుమారు 50 ఏళ్లు ఉంటాయని, కలర్ షర్టు, గోధుమ కలర్ ప్యాంటు ధరించాడని, ఆచూకీ తెలిసిన వారు కృష్ణగిరి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

- మృతదేహం ప్రకాశం జిల్లాకు తరలింపు



లింగారెడ్డి (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన లింగారెడ్డి(21) అనే ఇంజినీరింగ్ విద్యార్థి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం అకివీడు గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి, శ్రీదేవిల ఒక్కగానొక్క కుమారుడు లింగారెడ్డి(21). ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట సెయింట్ జాన్స్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. భాస్కర్‌రెడ్డి తన సోదరుడు వినోద్ ఆదోనిలో ఉండటంతో కుమారుడిని ఆదోనిలో ఉంచాడు. రోజూ లింగారెడ్డి బస్సులో కాలేజీకి వెళ్లివచ్చేవాడు. శుక్రవారం ఆదోని నుంచి తన స్నేహితుడి బైక్ తీసుకొని కాలేజీకి వచ్చాడు. ఎమ్మిగనూరు సమీపంలోని షాదీఖానా దగ్గర ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ కొనటంతో ఇద్దరు విద్యార్థులకు గాయాలైన విషయం తెలిసిందే. లింగారెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో రెండు రోజులు ప్రైవేటు హస్పిటల్‌లో చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందటంతో తల్లి దండ్రులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అకివీడుకు తరలించినట్లు ట్రాఫిక్ ఏఎస్‌ఐ నటరాజ్ ఆదివారం విలేకరులకు తెలిపారు.

నిశ్శబ్దాన్ని ఛేదించారు!

- నాలుగేళ్లుగా తగ్గుతున్న ఎయిడ్స్ కేసులు
- ఉమ్మడి జిల్లాలో నియంత్రణలోకి వస్తున్న హెచ్‌ఐవీ
- గతంతో పోలిస్తే పాజిటివ్ కేసులు తగ్గుదల
- ప్రభుత్వ పథకాలు, నియంత్రణకు తీసుకుంటున్న చర్యలే కారణం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఏఆర్‌టీ సెంటర్



సంవత్సరం	సాధారణ ప్రజలు హెచ్‌ఐవీ పరీక్షలు	సాధారణ ప్రజలు హెచ్‌ఐవీ బాధితులు	గర్భిణులు హెచ్‌ఐవీ పరీక్షలు	గర్భిణులు హెచ్‌ఐవీ బాధితులు
2016-17	61,739	1,224	61,723	83
2017-18	78,484	1,249	62,498	67
2018-19	88,156	1,383	72,607	69
2019-20	1,04,492	1,223	97,230	54
2020-21	56,169	576	86,309	47
2021-22	87,865	885	1,02,170	54
2022-23	68,182	620	83,596	36
2023-24 (జూన్ వరకు)	19,391	148	18,871	5

కర్నూలు(హాస్పిటల్): ఇదివరకు కోవిడ్ అంటే ఎలాగుండేదో...ఒకప్పుడు ఎయిడ్స్ అంటే అందరికీ అలాంటి భయమే ఉండేది. ఎక్కడైనా ఎయిడ్స్ బాధిత వ్యక్తి ఉన్నాడని తెలిస్తే ఆ ఛాయలకు కూడా వెళ్లేవారు కాదు. ఇది అంటువ్యాధి కాదు...అంటించుకునే వ్యాధని తెలిసినా ఏ ఒక్కరూ బాధితులను దగ్గరకు తీసేవారు కాదు. కనీసం కుటుంబసభ్యులూ వారిని పట్టించుకోకుండా ఓ మూలన ఉంచేవారు. అలాంటిది ఇప్పుడు ఆ వ్యాధి పట్ల అవగాహన వచ్చింది. వారితో కలిసిమెలసి జీవనం సాగిస్తున్నారు. కలసి కాపురమూ చేస్తున్నారు. అంటించుకునే వ్యాధి అయినా అంటించుకోవడానికి ఏ ఒక్కరూ సాహసించడం లేదు. అవగాహనతో మసలుకుని జీవనం సాగిస్తున్నారు. ఫలితంగా నాలుగేళ్లుగా ఉమ్మడి జిల్లాలో ఎయిడ్స్ మహమ్మారి తగ్గుముఖం పడుతోంది.

ఉమ్మడి జిల్లాలో హెచ్‌ఐవీని నిర్ధారించే 17 ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్లు(ఐసీటీసీ) ఉన్నాయి. అలాగే 79 ఫెసిలిటీ ఇంటిగ్రేటెడ్ ఐసీటీసీ-ఎఫ్‌ఐసీటీసీలు, నాలుగు మందులిచ్చే యాంటి రిట్రోవైరల్ థెరపి(ఏఆర్‌టి) సెంటర్లు, మూడు డిసిగ్నేటెడ్ ఎస్‌టీఐ/ఆర్‌టీఐ సెంటర్లు(సురక్ష క్లినిక్స్) పనిచేస్తున్నాయి. హెచ్‌ఐవీ బాధితుల కోసం ఐదు టార్గెట్ ఇంటర్వెన్స్‌తోపాటు ఒక కేర్ సపోర్ట్ సెంటర్, ఒక లింక్ వర్కర్ స్కీమ్(విలేజ్ కవరేజ్ స్కీమ్) పనిచేస్తున్నాయి. అలాగే 10 స్వచ్ఛంద సంస్థలు, 13 బ్లడ్‌బ్యాంకులు, ఐదు బ్లడ్‌స్టోరేజ్ సెంటర్లు సేవలు అందిస్తున్నాయి.

తగ్గుతున్న ఎయిడ్స్ బాధితులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2002లో 0.50శాతం ఉన్న హెచ్‌ఐవీ వ్యాప్తి 2022-23 నాటికి 0.04శాతానికి తగ్గిపోయింది. గతేడాది అక్టోబర్ వరకు 30,448 మందికి పరీక్ష చేయగా 376 మందికి పాజిటివ్ వచ్చింది. అలాగే గర్భిణుల్లో 3,5391 మందికి పరీక్షించగా 13 మందికి మాత్రమే హెచ్‌ఐవీ ఉన్నట్లు తేలింది. గతంలో కంటే కేసుల పెరుగుదలలో మరింత తగ్గుదల సూచిస్తోంది.

పటిష్టంగా ప్రభుత్వ చర్యలు

ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల కారణంగా హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. గతంతో పోలిస్తే హెచ్‌ఐవీ పరీక్షలను అధికంగా చేస్తున్నారు. మరోవైపు వ్యాధి నియంత్రణకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నారు. వ్యాధి లక్షణాలున్న వారిని ముందే గుర్తించి వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితునితో పాటు కుటుంబసభ్యులకూ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. విస్తృతంగా కండోమ్స్ పంపిణీ చేస్తున్నారు. గతంతో జిల్లా, మండల కేంద్రాల్లో మాత్రమే హెచ్‌ఐవి పరీక్షలు నిర్వహించేవారు. ఇప్పుడు మొబైల్ వాహనాల ద్వారా కూడా చేస్తున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా కూడా పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో జిల్లా కేంద్రం, ఏరియా ఆసుపత్రుల్లోనే ఏఆర్‌టీ మందులు ఇచ్చేవారు. ఇప్పుడు 50 కి.మీ పరిధిలో మందుల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. దీనివల్ల బాధితులకు రవాణా ఖర్చు సమయం ఆదా అవుతోంది. గతంలో జిల్లా కేంద్రంలో మాత్రమే ఎయిడ్స్ నివారణకు ఉద్యోగులు ఉండేవారు. గత డిసెంబర్‌లో ఐసీటీసీ కౌన్సిలర్, ఫార్మాసిస్టు, స్టాఫ్‌నర్సు, 36 మంది టెక్నీషియన్లు అందుబాటులోకి వచ్చారు. ఫలితంగా యేడాదికేడాది వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గుముఖం పడుతూ వస్తోంది. 2015-16 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో పరీక్షలు నిర్వహించిన సాధారణ ప్రజల్లో 1.98శాతం ఉండగా, గర్భిణుల్లో 0.13శాతం ఉండేది. ప్రస్తుతం సాధారణ ప్రజల్లో 0.91శాతం, గర్భిణుల్లో 0.04శాతం మాత్రమే హెచ్‌ఐవి బాధితులు ఉన్నారు.

ప్రజల్లో అవగాహన పెరిగింది



హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై పట్ల ప్రజల్లో అవగాహన పెరిగింది. బాధితులు గతంలో మధ్యలో మందులు మానేసేవారు. ఇప్పుడు కచ్చితంగా మందులు వాడే వారి సంఖ్య పెరిగింది. మందులు సైతం ఆధునికమైన, సింపుల్ కోర్సుతో వచ్చాయి. హైరిస్క్ వారిని గుర్తించి వారికి పరీక్షలు చేస్తున్నాం. వారికి పాజిటివ్ వస్తే వారితో సంబంధం ఉన్న వారందరికీ పరీక్షలు చేస్తున్నాం. రక్తదాన సమయాల్లోనూ ఐదెంచెలుగా రక్తపరీక్షలు చేస్తున్నాం. దీనివల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాధి వ్యాప్తి చెందకుండా నిరోధిస్తున్నాం.

–డాక్టర్ ఎల్. భాస్కర్, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి, కర్నూలు

ప్రభుత్వ పథకాలు ఇవీ..

- ఐసీడీఎస్(ఐసీపీఎస్) ద్వారా హెచ్‌ఐవీ బాధిత, పీడిత చిన్నపిల్లలకు నెలకు రూ.500 చొప్పున వారి ఖాతాలో నేరుగా జమ చేస్తున్నారు.
- విద్యాశాఖ ద్వారా ఎన్‌ఎస్‌ఎస్ సహకారంతో కళాశాలల్లో రెడ్‌రిబ్బన్ క్లబ్ అనే కార్యక్రమాన్ని అమలు చేస్తూ జిల్లా వ్యాప్తంగా విద్యార్థినీ విద్యార్థులకు హెచ్‌ఐవి/ఎయిడ్స్‌పై సంపూర్ణ అవగాహన కల్పించడంతో పాటు స్వచ్ఛంద రక్తదానానికి ప్రోత్సహిస్తున్నారు.
- పోలీస్, ఎన్‌ఎస్‌ఎస్, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌సీసీ వారు జిల్లాలో కరోనా సమయంలోనూ స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తదానం చేసి రక్తకొరత లేకుండా సురక్షిత రక్తమార్పిడి ద్వారా హెచ్‌ఐవీ శాతాన్ని తగ్గించేందుకు దోహదపడ్డారు.

తొలిసారిగా 20 ఫ్లోర్లతో అపార్ట్‌మెంట్ నిర్మాణం

- డీఆర్‌సీ ఇన్‌ఫ్రా అండ్ బిల్డర్స్ అధినేత డి రామచంద్రయ్య



డీఆర్‌సీ ఇన్‌ఫ్రా బిల్డర్స్ నూతన కార్యాలయం ప్రారంభానికి హాజరైన ఎంపీ, మేయర్, ఎమ్మెల్యేలు

కర్నూలు (న్యూటౌన్): రాయలసీమ ముఖద్వారమైన కర్నూలులో తొలిసారిగా 20 ఫ్లోర్లతో అద్భుతమైన అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టబోతున్నామని డీఆర్‌సీ ఇన్‌ఫ్రా అండ్ బిల్డర్స్ అధినేత డి రామచంద్రయ్య వెల్లడించారు. కర్నూలు సమీపంలోని నందికొట్కూరు రోడ్డులో 2 ఎకరాల్లో నూతనంగా డీఆర్‌సీ ఇన్‌ఫ్రా అండ్ బిల్డర్స్ వారి అత్యాధునిక టెక్నాలజీతో ఈ నిర్మాణం చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఆదివారం రాత్రి కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో డీఆర్‌సీ ఇన్‌ఫ్రా అండ్ బిల్డర్స్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, కర్నూలు మేయర్ బీవై రామయ్య, పాణ్యం, కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, సుధాకర్, తొగూరు ఆర్థర్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌సీ ఇన్‌ఫ్రా అండ్ బిల్డర్స్ అధినేత డి రామచంద్రయ్య మాట్లాడుతూ.. డీఆర్‌సీ ఇన్‌ఫ్రా అండ్ బిల్డర్స్ ఆధ్వర్యంలో మరో అద్భుతమైన ప్రాజెక్టును గార్గేయపురం - నందికొట్కూరు రోడ్డులో శ్రీహరి నేచర్స్ నెస్ట్ పేరుతో ఇండిపెండెంట్, డూప్లెక్స్ హౌసెస్ నిర్మాణం చేపట్టామని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మధ్యతరగతి ప్రజలకు అనుకూలంగా డిజైన్ చేసి నూతన వెంచర్ ప్రారంభిస్తామన్నారు. గతంలో నందికొట్కూరు రోడ్డులో శ్రీహరి టౌన్‌షిప్, శ్రీహరి గార్డెన్స్, శ్రీహరి ఆక్సిజన్ సిటీలో ఇండిపెండెంట్ హౌసెస్, విల్లాస్‌ను పూర్తి చేసి కర్నూలు సిటీ ప్రజలకు అందించి వారి మన్ననలు పొందామని తెలిపారు.



డీఆర్‌సీ ఇన్‌ఫ్రా బిల్డర్స్ నూతన కార్యాలయం

ప్రాణం తీసిన ఈత సరదా

- స్వర్ణముఖి నదిలో నీట మునిగి డోన్ యువకుడి మృతి



కార్తీక్ మృతదేహం

డోన్ టౌన్: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని రెడ్డివారిపల్లె వద్ద స్వర్ణముఖి నదిలో ఆదివారం ఈతకు వెళ్లి ఓ విద్యార్థి మృతి చెందాడు. డోన్ పట్టణానికి చెందిన కార్తీక్(19) వెంకట పద్మావతి మెడికల్ కళాశాలలో ఫిజియోథెరపీ సెకండియర్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయాడు. స్నేహితులు సంతోష్, మహబూబ్‌బాషా కాపాడేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. విద్యార్థుల కేకలు విన్న స్థానికులు నదిలో దిగి కార్తీక్ మృతదేహాన్ని వెలికి తీశారు. చంద్రగిరి సీఐ రాజశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని మెడికల్ కళాశాల తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేలైన వంగడాల ఎంపికతోనే సత్ఫలితాలు

నంద్యాల(సెంట్రల్): ఖరీఫ్ సాగులో అన్నదాతలు మేలైన వంగడాలను ఎంపిక చేసుకుంటే అధిక దిగుబడులు సాధించి ఆదాయం పొందవచ్చునని నంద్యాల ఏరువాక కేంద్రం సమన్వయకర్త సరళమ్మ సూచించారు. జిల్లా వ్యాప్తంగా వరి, కంది, వేరుశనగ, మినుము, పెసర, కొర్ర, జొన్న, సజ్జ, ఆముదం విస్తారంగా సాగు చేస్తున్నారన్నారు.

- వరిలో.. నంద్యాల సోనా, కర్నూలు సోనా, నెల్లూరు సోనా, నెల్లూరు సిరి, మారుటేరు సాంబా
- కందిలో.. ఎల్‌ఆర్‌జీ-52, టీఆర్‌జీ-59, ఎల్‌ఆర్‌జీ-105, ఆశ
- వేరుశనగలో.. కదిరి లేపాక్షి, కే-6, ధరణి, టీసీజీఎస్-1694, కే-9, కదిరి హరితాంధ్ర, కదిరి అనంత
- మినుములో.. ఎల్‌బీజీ-884, టీబీజీ-104, జీబీజీ-1, పీయూ-31
- పెసరలో.. ఎల్‌జీజీ-574, ఎల్‌జీజీ-607, డబ్ల్యూజీజీ-42, ఎంజీజీ-295, ఐపీఎం-2-1-4
- కొర్రలో.. మహానంది, ఎస్‌ఐఏ-3156, సూర్యనంది, గరుడ, రేనాడు
- జొన్నలో.. పచ్చజొన్న-ఎన్-15, తెల్లజొన్న-ఎన్‌టీజే-5
- సజ్జలో.. ఏబీవీ-04 రకం, ఆముదంలో ఐసీహెచ్-66, డీసీహెచ్-177, డీసీహెచ్-519 రకాలు మేలైనవని తెలిపారు.
- మేలైన వంగడాల కోసం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రం, స్థానిక ఆర్‌బీకే కేంద్రాల్ని సంప్రదించి రైతన్నలు పొందవచ్చని పేర్కొన్నారు.

నల్లమల ఘాట్‌లో లారీ బోల్తా



మహానంది: నంద్యాల - గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో ఐషర్ లారీ బోల్తాపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. టైల్స్ పౌడర్ బస్తాలతో నరసరావుపేట నుంచి అనంతపురం వెళ్తున్న లారీ నల్లమలలోని పాతబొగద (మోదుగమాను వంతెన) వద్ద బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ గోపిచంద్ అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న రోడ్‌సేఫ్టీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం జేసీబీ సాయంతో లారీని యథాస్థానికి తీసుకొచ్చారు.

దేశ రక్షణలో భాగస్వాములుకండి



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ మానవీయ విభాగ్ సంఘ చాలక్ బర్రెంకల నీలకంఠ

కర్నూలు కల్చరల్: దేశ రక్షణలో భాగస్వాములు కావాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మానవీయ విభాగ్ సంఘ చాలక్ బర్రెంకల నీలకంఠ పిలుపునిచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ నగర సాంఘిక్ ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో ఆదివారం జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణ జీవితంతో ముందుకు సాగుతూ సమాజ సేవలో పాలు పంచుకోవాలన్నారు బాబారాందేవ్ పతంజలి యోగా భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా ప్రభావరి ఎస్.వి. శివరాజ్, ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి, అన్ని ఉప బస్తీల కార్యకర్తలు పాల్గొన్నారు.

వలగొండలో ఇరువర్గాల ఘర్షణ

- 15 మందికి గాయాలు

ఆస్పరి: మండల పరిధిలోని వలగొండ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఇరు వర్గాలు మధ్య ఘర్షణ జరిగి 15 మందికి గాయాలైనట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. మొహర్రం సందర్భంగా అగ్నిగుండం దగ్గర సావుసేన్ ఆడే సమయంలో ఒకరి కాలను మరొకరు తొక్కారని వాగ్వాదం జరిగి రెండు వర్గాల వారు కట్టెలు, రాడ్లు, కారం పొడి చల్లుకుంటూ దాడులకు పాల్పడ్డారు. ఘర్షణను అదుపు చేసేందుకు వెళ్లిన ఇద్దరు కానిస్టేబుళ్ల కళ్లలో కారం పొడి పడింది. ఒక వర్గం వారు వేరే వర్గం కాలనీపై మూక్ముడిగా దాడికి పాల్పడడంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. దాడుల్లో రెండు మోటారు సైకిళ్లను ధ్వంసం అయ్యాయి. పరుశన్న, పుష్పావతి, యల్లప్ప, రేణుకమ్మ, రాముడు, ఉచ్చీరప్ప, అంజినమ్మ, అంజిలి, రాధిక, హనుమంతమ్మతో పాటు మరో ఐదుగురు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆదోని, కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స పొందుతున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. సంఘటన జరిగిన వెంటనే పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఆస్పరి ఎస్‌ఐ వరప్రసాద్, పోలీస్ సిబ్బందితో వలగొండకు చేరకుని పరిస్థితిని అదుపు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.

ఆటోలోనే ప్రసవం చేసిన వైద్య సిబ్బంది



ఆసుపత్రిలోని ఇంక్యుబేటర్‌లో శిశువును ఉంచిన దృశ్యం

నంద్యాలటౌన్: నంద్యాల సర్వజన ఆసుపత్రి వైద్య సిబ్బంది మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని విశ్వనగర్ ప్రాంతానికి చెందిన గర్భిణి మల్లికకు శనివారం రాత్రి నెలలు నిండి నొప్పులు ప్రారంభం కావడంతో కుటుంబీకులు ఆటోలో నంద్యాల సర్వజన ఆసుపత్రికి బయలుదేరాడు. ఆసుపత్రి ప్రాంగణంలోనికి రాగానే మల్లికకు నొప్పులు ఎక్కువ కావడంతో ఆమె భర్త వెంకటేశ్వర్లు ఆటో నిలిపి మాతా శిశు విభాగంలోనికి వెళ్లి సిబ్బందికి విషయం చెప్పాడు. వెంటనే స్పందించిన డ్యూటీ డాక్టర్ సుహాసిని వైద్య సిబ్బందితో ఆటో వద్దకు చేరుకుని వెంటనే పరదాలు ఏర్పాటు చేసి ప్రసవం చేయగా మల్లిక పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే తల్లీబిడ్డలను చికిత్స నిమిత్తం వార్డుకు చేర్చి వైద్యం అందించారు. తల్లీబిడ్డా ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. సకాలంలో స్పందించి వైద్యం చేసిన వైద్య సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బెల్లం మహేశ్వరరెడ్డి



బెల్లం మహేశ్వరరెడ్డికి నియామక పత్రం అందిస్తున్న ఆర్ కృష్ణయ్య

కర్నూలు(అర్బన్): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య నియామకపత్రాన్ని అందించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేంతవరకు పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కమిటీలతో మమేకమై కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం రాంబాబు, కనికె శివరాం, బీసీ విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కొత్తకోట మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేషబాబు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బెల్లం మహేశ్వరరెడ్డి నియామకం పట్ల పలువురు బీసీ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నల్లమలలో వజ్రాన్వేషణ



వాగులో వజ్రాల కోసం అన్వేషిస్తున్న ప్రజలు



మహానంది: పచ్చటి నల్లమల అందాల నడుమ ఎంతో ఆశగా కొందరు వజ్రాన్వేషణ చేస్తున్నారు. నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని మహానంది, శిరివెళ్ల మండలాల సరిహద్దుల్లో ఉన్న సర్వనరసింహస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఉన్న వంకకు వజ్రాల వంక అని పేరు. ఈ వంకలో నిత్యం నీరు ఓ స్థాయిలో ప్రవహిస్తూ ఉంటుంది. ఈ ప్రాంతంలో గత నాలుగైదేళ్ల నుంచి వివిధ ప్రాంతాల ప్రజల వజ్రాల కోసం అన్వేషిస్తున్నారు. రాళ్లల్లో, ఇసుకల్లో రత్నాలు దొరకకపోవా.. అంటూ ఆశతో వెతుకుతుంటారు. రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా ప్రకాశం, గుంటూరు, విజయవాడ, కృష్ణా జిల్లాల నుంచి ప్రజలు వస్తున్నారు. గత ఏడాది, రెండేళ్ల క్రితం రూ. 4 లక్షల నుంచి రూ. 50 వేల వరకు విలువ పలికే వజ్రాలు, విలువైన జాతి రంగురాళ్లు దొరికాయి. దీంతో తాజాగా వర్షాలు కురుస్తుండటంతో వజ్రాన్వేషణ కోసం వచ్చేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఉదయం ఆరు గంటలకు వెళ్లి చీకటి పడే వరకు వెతికి రాత్రి స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద సేదతీరుతుంటారు. వారం రోజుల క్రితం గుంటూరు జిల్లాకు చెందిన ఒకరికి రూ. 40వేల విలువైన వజ్రం, మరికొందరికి విలువైన రాళ్లు దొరికినట్లు సమీప గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు.

పాముకాటుకు మహిళ మృతి

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన హజరాబీ(52) అనే మహిళ పాము కాటుతో శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ తిరుపాల్ ఆదివారం తెలిపారు. పశువుల మేతకు వెళ్లి పొలం గట్లపై గడ్డికోసుకుంటుండగా చేతికి కాటు వేసింది. వెంటనే కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతిచెందింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

'ఏపీఎన్‌జీవో' మహాసభలను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న వెంగళ్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం(ఏపీఎన్‌జీవో అసోసియేషన్) రాష్ట్ర మహాసభలు ఆగస్టు 21, 22వ తేదీల్లో విజయవాడలో పెద్ద ఎత్తున జరగనున్నాయని, వీటిని విజయవంతం చేద్దామని ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సి.క్యాంపు సెంటరులోని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విజయవాడలోని ఇందిరగాంధీ స్టేడియంలో జరిగే రాష్ట్ర మహాసభలకు ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి కనీసం 3 వేల మంది ఉద్యోగులు తరలి వెళ్లాలన్నారు. మొదటి రోజు మహాసభలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసిందని, పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌గా రిటైర్ ఐఏఎస్ అధికారి మన్‌మోహన్‌సింగ్‌ను కూడా నియమించిందని తెలిపారు. రాష్ట్ర మహాసభల నేపథ్యంలో అన్ని సమస్యలకు లభిస్తుందని పేర్కొన్నారు. కరోనాతో చనిపోయిన ఉద్యోగుల కుటుంబసభ్యులకు కూడా ఒకేసారి కారుణ్య నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని పేర్కొన్నారు. నూతన జిల్లా కేంద్రాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్ఆర్‌ఏ 16 శాతం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్ మాట్లాడుతూ.. ఏపీ ఎన్‌జీవో అసోషియేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, ఉమ్మడి జిల్లా శాఖ అసోషియేట్ ప్రసిడెంటు ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు నగరశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, పాండురంగారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు సాంబశివారెడ్డి, కేసీహెచ్ కృష్ణుడు, బలరామిరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్ని తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా అసోసియేషన్‌లో ఖాళీగా ఉన్న జాయింట్ సెక్రటరీ పోస్టుకు జనరల్ ఆసుపత్రిలో రేడియోగ్రాఫర్‌గా పనిచేస్తున్న జనార్దన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.